క్లుప్తంగా

ఘనంగా గురుపూజోత్సవం

ఉక్కునగరం: స్థానిక సత్యసాయి మందిరంలో మాస్టర్ ఎక్కిరాల కృష్ణమాచారి గురుపూజోత్సవాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం భగవన్నామ సంకీర్తన నిర్వహించారు. అనంతరం లక్ష్మీనారాయణ షోడశోపచార పూజ, రుద్రాభిషేకం, శ్రీలలితా సహస్ర నామ పారాయణ, కుంకుమార్చన జరిగాయి. మాస్టర్ ఈకే హీలింగ్ సర్వీస్ సెంటర్ సమన్వయకర్త అంట్యాకుల నరసింహమూర్తి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

స్టీల్‌క్లబ్ కార్యదర్శిగా పెంటకోట రామకృష్ణ ఎన్నిక



ఉక్కునగరం: ఉక్కు కనిష్ట అధికారుల మానసిక ఉల్లాస కేంద్రం (స్టీల్‌క్లబ్) కార్యదర్శిగా పెంటకోట రామకృష్ణ ఎన్నికయ్యారు. ప్రస్తుత కార్యవర్గ కాలపరిమితి ముగియడంతో టౌన్ అడ్మినిస్ట్రేషన్ విభాగం డీజీఎం జె.బాబూనాయక్ రిటర్నింగ్ అధికారిగా నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 832 ఓట్లలో 508 ఓట్లు పోలయ్యాయి. అనంతరం జరిగిన కౌంటింగ్‌లో కార్యదర్శిగా పెంటకోట రామకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా వై.రవికుమార్, కోశాధికారిగా డి. వేణుగోపాల్ ఎన్నికయ్యారు. అదే విధంగా కార్యవర్గ సభ్యులుగా పి.ఆర్.ఎస్. సాయిరవి, కె.రంగనాథం, ఎం.వెంకటరాజు, బి. వెంకటరమణ, జె. రమేష్‌కుమార్, ఎ. రమేష్, వి.నాగభూషణ రాజు ఎన్నికైనట్టు రిటర్నింగ్ అధికారి తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



భెల్ టౌన్‌షిప్ క్రీడా మైదానంలో టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న గోవిందరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌పీవీ హార్ట్ ఫుల్ ఓల్డ్ అండ్ న్యూ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో బీహెచ్‌పీవీ విశ్రాంత ఉద్యోగుల కుటుంబాల క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. భెల్ టౌన్ షిప్‌లోని క్రీడా మైదానంలో శుక్రవారం పోటీలను సంస్థ గుర్తింపు యూనియన్ ప్రతినిధులతో పాటు 69 వ వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి ప్రారంభించారు. ఫ్రెండ్స్ ప్రతినిధులు మాట్లాడుతూ 40 సంవత్సరాల తర్వాత సంస్థ విశ్రాంత ఉద్యోగుల పిల్లలు వివిధ రంగాల్లో ఉన్నా తమ స్నేహానికి గుర్తుగా ఈ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 8 టీంలు పాల్గొన్న ఈ టోర్నమెంట్ మూడు రోజుల పాటు సాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ములక నానిబాబు (యూఎస్‌ఏ), జె.రాము, ఎస్.ఎస్.ఎస్.రవి, వై.కృష్ణ, ఎం.ఎస్.కుమార్, పసుపులేటి శ్రీనివాస్, శేఖర్, పాండురంగ, రవి, ప్రశాంత్, సాధు తదితరులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీకి మంచాల వితరణ



మంచాలు, ఓపీ టేబుల్ అందజేస్తున్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు

పెదగంట్యాడ: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పాన్ ఇండియా సీఎస్సార్ యాక్టివిటీస్‌లో భాగంగా శుక్రవారం గంగవరం యూపీహెచ్‌సీకి మూడు మంచాలు, ఒక ఓపీ టేబుల్‌ను యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హేమలతకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్సాహంగా విండ్ బాల్ పోటీలు



క్రీడా కారులను పరిచయం చేసుకుంటున్న కరణంరెడ్డి నర్సింగరావు

పెదగంట్యాడ: సంక్రాంతి పండగను పురస్కరించుకొని మండలంలోని సీతానగరం స్కూల్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న వైజాగ్ విండ్ బాల్ ప్రీమియర్ లీగ్ పోటీలను శుక్రవారం గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ప్రారంభించారు. ముందుగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. యువత కోసం ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

పండగ శోభ



ఓ షాపింగ్ మాల్ ఎదుట వినియోగదారులు

- కిటకిటలాడుతున్న మార్కెట్లు
- రద్దీగా మారిన రోడ్లు



కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్న గాజువాక మెయిన్ రోడ్డు

గాజువాక: గాజువాకకు సంక్రాంతి శోభ వచ్చేసింది. షాపింగ్ మాల్స్, వస్త్ర దుకాణాలు దవళకాంతులతో మెరిసిపోతున్నాయి. కొత్త గాజువాక నుంచి పాత గాజువాక వరకూ మెయిన్‌రోడ్డులో గల ఫుట్‌పాత్ షాపుల్లో కూడా సంక్రాంతి షాపింగ్ పోటాపోటీగా సాగుతోంది. కొనుగోలుదార్లతో మార్కెట్లు కిటకిటలాడుతున్నాయి. సంక్రాంతి సమీపించడంతో రెండురోజులుగా వ్యాపారాలు ఊపందుకున్నాయి. దీంతో వ్యాపార సంస్థలు, వస్త్ర దుకాణాలు కళకళలాడుతున్నాయి. గాజువాకలో షోరూంలు, వివిధ వ్యాపార సంస్థలు బాగా విస్తరించడంతో అన్ని వస్తువులు ఇక్కడే లభ్యమవుతున్నాయి.

కొండదిగుతున్న కాలనీలు

ఉద్యోగ, ఉపాధి నిమిత్తం గాజువాకలోని వివిధ కొండవాలు ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా సొంతూళ్లకు వెళ్లడానికి సిద్ధమవుతున్నారు. విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించడంతో కొంతమంది ఇప్పటికే వెళ్లిపోయారు. గాజువాకలోని భానోజీతోట, ఎల్‌బీఎస్‌నగర్, దశమికొండ, శ్రీనగర్, సుందరయ్యకాలనీ, సింహగిరి కాలనీ, దయాళ్‌నగర్, పైడిమాంబ కాలనీ, పెంటయ్యనగర్, కృష్ణానగర్, గణేష్‌నగర్, బొజ్జన్నకొండతోపాటు అప్పన్న కాలనీల్లో సుమారు సుమారు 20వేల కుటుంబాలు స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నాయి. ఉపాధి కోసం ఇక్కడికి వలసొచ్చిన ఈ కుటుంబాల్లో దాదాపు 70 శాతం కుటుంబాలు పండక్కి వెళ్తాయి. ఎక్కువ మంది గాజువాకలో పండగ షాపింగ్ పూర్తి చేసుకొని భోగిరోజు బయల్దేరతారు. అయితే, ఈ సారి రెండో శనివారం, ఆదివారం కూడా కలిసి రావడంతో రెండు రోజుల ముందుగానే అందరూ బయల్దేరుతున్నారు. వారం రోజులపాటు తమ సొంత గ్రామాల్లో గడిపి తిరిగి వస్తారు.

ఫుట్‌పాత్ దుకాణాల్లో సందడి



ఫుట్‌పాత్ దుకాణాల వద్ద కొనుగోళ్లు

ఫుట్‌పాత్, రోడ్డు సైడు దుకాణాల్లో సందడి కనిపిస్తోంది. వ్యాపారులు కోల్‌కతా, చెన్నై, రాజస్తాన్, తిరుపూర్‌వంటి ప్రాంతాల నుంచి రెడీమేడ్ దుస్తులు తెచ్చి అమ్మకాలు సాగిస్తున్నారు. పలు వ్యాపార సంస్థలు స్టాక్ క్లియరెన్స్‌ల పేరిట ఆఫర్లను ప్రకటించడం ద్వారా వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నాయి. దీంతో ఉదయం నుంచి రాత్రి పొద్దు పోయేవరకూ ఇసుకేస్తే రాలనంతగా జనాలతో రద్దీ నెలకుంటోంది. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు కోస్తా ప్రాంతంలోని పలు జిల్లాలకు చెందినవారు సంక్రాంతికి తమ ప్రాంతాలకు బయల్దేరనుండడంతో ఇక్కడే పండగ షాపింగ్ చేస్తున్నారు. ఈ కారణంగా షోరూమ్‌లతో పాటు రోడ్డుసైడు దుకాణాలకు కూడా కొనుగోలుదారులు పోటెత్తారు.

భరత్‌నగర్ వాసులకు తీరిన విద్యుత్ వెతలు



11కేవీ విద్యుత్ ఫీడర్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఈ శ్యామ్‌బాబు

అగనంపూడి: లోవోల్టేజీ సమస్య, విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులతో ఇబ్బందులు పడుతున్న భరత్‌నగర్‌వాసులకు ఆ సమస్య తీరింది. కూర్మన్నపాలెంలోని భరత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన 11కేవీ ఫీడర్‌ను శుక్రవారం ఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యామ్‌బాబు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ భరత్ నగర్‌లో సుమారు 3వేల విద్యుత్ కనెక్షన్లు ఉండడంతో విద్యుత్ సమస్య తలెత్తేదని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి 11 కేవీ ఫీడర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డీఈ టీకే నాయుడు, ఏడీఈ రామకృష్ణ, ఏఈ రుషికేష్, ప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు కళ్లద్దాల అందజేత

పెదగంట్యాడ: అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధులకు శుక్రవారం కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఫౌండేషన్ సీఎస్సార్ మేనేజర్ రమేష్‌బాబు మాట్లాడుతూ గత నెల 21న నెల్లిముక్కులో మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించామని తెలిపారు. ఆ శిబిరంలో మొత్తం 300కి నేత్ర పరీక్షలు చేశామని, అందులో 178 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించామని, వాటిని ఇప్పుడు అందజేశామన్నారు.

సంబరాల సంక్రాంతి



లంకెలపాలెం హైస్కూల్‌లో వివిధ వేషధారణల్లో విద్యార్థులు



పతంగుల పోటీకి సిద్ధమైన విద్యార్థులు



ఏబీఎస్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు



పొంగలి తయారు చేస్తున్న ఉపాధ్యాయులు



వివిధ వేషధారణల్లో సాయి శర్వాణి స్కూల్ విద్యార్థులు

- వివిధ వేషధారణల్లో అలరించిన విద్యార్థులు
- సాంస్కృతిక ప్రదర్శనలతో సందడి

అగనంపూడి: సంక్రాంతి సంబరాలను పలు పాఠశాలల్లో శనివారం సందడిగా నిర్వహించారు. సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబిచాయి. భోగి మంట, డూడూ బసవన్నతో పాటు వివిధ వేషధారణల్లో విద్యార్థులు అలరించారు.

➡ 79వ వార్డు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి ఉత్సవాల ప్రాధాన్యం తెలియజేస్తూ కార్యక్రమాలు నిర్వహించారు. భోగి మంటలు, గొబ్బెమ్మలు, హరిదాస్, సోది, ఎరుకుల వేషధారణలో విద్యార్థులు సందడి చేశారు. చెరుకు గెడలు, ముగ్గుల పోటీలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రొతు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

➡ 85వ వార్డు ఏబీఎస్ పాఠశాలలో సంక్రాంతి ఉత్సవాలు అంబరాన్ని తాకాయి. సంక్రాంతి మూడు రోజుల పండగ, తెలుగు సంస్కృతిని తెలియజేస్తూ కార్యక్రమాలు నిర్వహించారు. గంగిరెద్దుల ఆటలు, హరిదాసు కీర్తనలు, కోలాటం, జానపద నృత్యాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకుడు పీఎం కొండయ్య, తిరుపతమ్మ, ప్రిన్సిపాల్ పద్మజ, డైరెక్టర్ దీపక్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలోని వేంకటేశ్వర ఇంగ్లిష్ మీడియం స్కూల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు పొంగల్ తయారు చేసి విద్యార్థులకు అందజేశారు. స్కూల్ కరస్పాండెంట్ డొక్కాడ ఆనందరావు, ప్రిన్సిపాల్ భాస్కరరావు పాల్గొన్నారు.

➡ శ్రీ సాయి శర్వాణి ఇంగ్లిష్ మీడియం స్కూల్లో విద్యార్థులు పలు వేషధారణల్లో అలరించారు. స్కూల్ కరస్పాండెంట్ చంద్రమౌళి, భారతి, వైఎస్సార్ సీపీ నాయకుడు సంద్రాన నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు'పై కూటమి వైఖరి స్పష్టం చేయాలి



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఆదినారాయణ

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ విషయంలో కూటమి నాయకులు స్పష్టమైన వైఖరి వెల్లడించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన 1429వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కు పరిరక్షణను బాధ్యతగా తీసుకుంటామని వాగ్దానాలు చేసిన కూటమి ప్రజాప్రతినిధులు గెలిచిన తర్వాత మౌనం వహించడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఉక్కు కార్మిక సంఘాల నాయకులు ఎస్.రామారావు, వై.టి.దాస్, డి.దేముడు, జి.ఆనంద్, డి.రమేష్, ఎంకేవీ రాజేశ్వరరావు, వర్మ పాల్గొన్నారు.

గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో ఆర్వో ప్లాంట్ ప్రారంభం



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న న్యాయమూర్తి షణ్ముఖరావు



ఆస్పత్రి ఆవరణలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

గాజువాక: గాజువాక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన వెయ్యి లీటర్ల సామర్థ్యం గల ఆర్వో ప్లాంట్‌ను 13వ అదనపు జిల్లా జడ్జి జి.షణ్ముఖరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన బార్ అసోసియేషన్ ప్రతినిధులను అభినందించారు. కక్షిదారులకు, న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి అందించడం కోసం రూ.3 లక్షలతో గాజువాక బార్ అసోసియేషన్ ద్వారా ప్లాంట్ ఏర్పాటు చేశామని అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బి.ప్రభాకరరావు, పి.పుల్లయ్య తెలిపారు. న్యాయమూర్తులు ఇ.రాజేంద్రబాబు, వై.శ్రీలక్ష్మి, వి.పల్లవి, ప్రదీప పాల్గొన్నారు.

అగనంపూడి: ఆస్పత్రిలో రోగులు, వారి సహాయకుల కోసం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి అన్నారు. కలితిల్ బ్రదర్స్ చైర్మన్ వి.వేణుగోపాల్ నాయర్ తన భార్య గీతాకుమారి జ్ఞాపకార్థం అగనంపూడి ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్ఎంవో ఉషా, ఏవో దంతులూరి రవిరాజ్, వైద్యులు గోపాలకృష్ణ పాల్గొన్నారు.

అభినందనల వెల్లువ

అక్కిరెడ్డిపాలెం: భెల్(హెచ్‌పీవీపీ) విశాఖపట్నం యూనిట్‌లో పని చేస్తూ జీఎం నుంచి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ)గా పదోన్నతి పొందిన జి.సుబ్రహ్మణ్యంను శుక్రవారం గుర్తింపు యూనియన్ ప్రతినిధులు పరిపాలన భవనంలో కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బొండా బాబూరావు, సుభాకర్ సాహూ, కొల్లి దేముడు, టెక్కలి భాస్కరరావు, బి.రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

➡ జీఎం నుంచి ఈడీగా పదోన్నతి పొందిన జి.సుబ్రహ్మణ్యంను శుక్రవారం భెల్ (హెచ్‌పీవీపీ) ప్రొగ్రసివ్ ఫ్రంట్ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు జి.టి.పి.ప్రకాష్, ఉరుకూటి బాబూరావు, ఎస్.జగన్నాథరావు, వి.నర్సింహమూర్తి, పి.కనకారావు, సీతంన్నాయుడు, వారాడ ఆనందరావు, జి.అచ్చంన్నాయుడు, ఆర్.నాగేశ్వరరావు, అల్లు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



సుబ్రహ్మణ్యంను అభినందిస్తున్న భెల్ గుర్తింపు యూనియన్ ప్రతినిధులు

అనాథలు, పేదలకు వితరణ



అనాథ బాలలకు భోజనాలు అందించిన జొన్నకూటి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు



పేదలకు చీరలు పంచిపెడుతున్న మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: జొన్నకూటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 88వ వార్డు మంగళపాలెంలోని అనాథ ఆశ్రమంలోని పిల్లలకు భోజనం, తినుబండారాలు అందించారు. డీజే ఫౌండేషన్ అధ్యక్షుడు తోట గోవిందరావు, రాహెల్ కుమారి దంపతులు ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జొన్నకూటి ఫౌండేషన్ చైర్మన్ జొన్నకూటి విజయ్‌కుమార్, కుమారి, అవినాష్, తేజస్వి పాల్గొన్నారు.

స్వామి వివేకానంద మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 87వ వార్డు వడ్లపూడి భవిత కేంద్రంలో మానసిక దివ్యాంగులైన మహిళలకు చీరలు, బాలలకు పండ్లు, కేక్‌లు, బిస్కట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ దాసరి బుజ్జి, కొయిలాడ శ్రీనివాసరావు, భవితా కేంద్రం ఉపాధ్యాయులు ఉమా, అనుపమ, పద్మ, ఝాన్సీ, కె.ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

స్టీల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడిగా రమణమూర్తి



ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఐఎన్‌టీయూసీ నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం సెంట్రల్ స్టోర్స్ యూనియన్ పాయింట్ వద్ద నిర్వహించారు. ప్రధానకార్యదర్శి మంత్రి రాజశేఖర్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా పి.వి. రమణమూర్తి, ప్రధానకార్యదర్శిగా బి.ఎస్. రాజు, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మద్ది అప్పలరాజురెడ్డి, అదనపు ప్రధానకార్యదర్శిగా కొవిరి అవతారం, సంయుక్త ప్రధాన కార్యదర్శిగా మొల్లి ఈశ్వరరావు, సహాయ ప్రధానకార్యదర్శులుగా ఎస్. రమేష్ కుమార్, చిన వెంకటేశ్వర్లు, ఎం.ఎస్.ఆర్. ప్రసాద్‌లను నియమించినట్టు తెలిపారు. అదే విధంగా సీనియర్ ఉపాధ్యక్షులుగా అత్తోటి రవి, పి.వి. నగేష్, ఉపాధ్యక్షులుగా మంత్రి గిరి ప్రసాద్, కార్యదర్శిగా బుదిరెడ్డి అప్పారావు, సంయుక్త కార్యదర్శిగా పులి చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పి. మధు, ప్రచార కార్యదర్శిగా కోరుబిల్లి అప్పారావు, కార్యదర్శి (ఐటీ)గా కొణతాల జగన్‌లు నియమితులైనట్టు ఆయన తెలిపారు.

ముగిసిన వృత్త్యంతర శిక్షణ తరగతులు

అగనంపూడి: వివిధ ఇంజినీరింగ్ కళాశాలల అధ్యాపకులకు దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన వృత్త్యంతర శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా తమిళనాడు ఐటీసీ అకాడమీ ట్రైనర్ ఆనంద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, డీన్ సుందర్‌రామమ్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

దర్శించి.. తరించి



భక్తులతో కిక్కిరిసిపోయిన తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం



ఉత్తరద్వార దర్శనం ప్రవేశంలో భక్తులు



ప్రసన్న వేంకటేశ్వరాలయంలో ఉత్తరద్వార దర్శనానికి బారులు తీరిన భక్తులు

అక్కిరెడ్డిపాలెం: వైకుంఠ ఏకాదశి పూజలను షీలానగర్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో, భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల ప్రసన్న వేంకటేశ్వరాలయంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి ఉత్తరద్వార దర్శనానికి భక్తులు పోటెత్తారు. శుక్రవారం వేకువ జాము నుంచే భక్తులు షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రానికి చేరుకుని ఉత్తర ద్వారం నుంచి తిరుమలేశుడిని దర్శించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో ఎస్టీబీఎల్ అధినేత గుత్తికొండ బాలాజీతో పాటు ట్రస్ట్ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సుమారు 30 నుంచి 35 వేల మంది భక్తులు ఉత్తరద్వారంలో స్వామిని దర్శించుకున్నారని అంచనా వేస్తున్నారు.

➡ భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల శ్రీ ప్రసన్న వేంకటేశ్వరాలయంలో వైకుంఠ ఏకాదశి పూజలను ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని ఉత్తరద్వార ప్రవేశంతో ప్రసన్న వేంకటేశ్వరుడిని దర్శించుకున్నారు. ఆలయ పరిపాలన అధికారి ఎస్.శ్రీనివాస్ భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి పూజలు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 3 గంటల నుంచి స్వామిని భక్తులు ఉత్తర ద్వారంలో దర్శనం చేసుకున్నారు. అంతకు ముందు ఆలయ ప్రధానార్చకులు భావ నారాయణ స్వామి నేతృత్వంలో అర్చకులు హరి నారాయణ, ఇతర అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు, దీపాలతో అర్చనలు చేశారు.



పూజలందుకున్న ప్రసన్న వేంకటేశ్వరుడు

➡ ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉక్కు బీసీ గేటు వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు సుధాకర్, సురేంద్ర, నడుపూరు శ్రీనివాస్, చీకటి శ్రీనివాస్, కె. నాగభూషణం, శశిభూషణ్, గోపిరెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా అర్ధఏకాహం

అగనంపూడి: ముక్కోటి ఏకాదశి సందర్భంగా 87వ వార్డు కణితి గాంధీ బొమ్మకూడలిలోని కోదండరామ ఆలయంలో అర్ధ ఏకాహం జరిపించారు. ఈ సందర్భంగా 28 ఏళ్లు పూర్తి చేసుకున్న బాలభారతి భజన మండలి నిర్వాహకులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బొద్ధ గోవింద్, ప్రగడ వేణుబాబు, బొద్ద సన్యాసిరావు, ప్రగడ శ్రీను,దుగ్గపు దానప్పలు, నారాయణ, ప్రగడ గోవిందరాజులు, శంకరరావు పాల్గొన్నారు.



స్టీల్‌ప్లాంట్ ఆలయంలో ఉత్తర ద్వారంలో వేంకటేశ్వరస్వామి



బాలభారతి భజన మండలి నిర్వాహకులను సత్కరిస్తున్న నిర్వాహకులు



కణితి రామాలయంలో అర్ధ ఏకాహం నిర్వహిస్తున్న భజన మండలి ప్రతినిధులు

➡ 79వ వార్డు అగనంపూడి శాంతినగర్ కాలనీలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారు జామునుంచే ఉత్తర దర్శనం భక్తులకు కల్పించారు. వార్డు కార్పొరేటర్ రొతు శ్రీనివాసరావు దంపతులు దర్శనం చేసుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పీఎస్ నాయుడు, ఉమామహేశ్వరరావు, హరిబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

74వ వార్డులో..

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ పరిధిలోని దయాల్ నగర్‌లోని వెంకటాద్రిపై కొలువుదీరిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు ఉత్తర ద్వారం నుంచి దర్శనాలు కల్పించారు. ఆలయ ధర్మకర్తలు తిప్పల వెంకటరమణారెడ్డి, అన్నపూర్ణ ఏర్పాట్లు చేశారు. అలాగే వినాయకనగర్ వుడా కాలనీలో వేంచేసియున్న ప్రసన్న వేంకటేశ్వర స్వామిని భక్తులు ఉత్తర ద్వారంలో దర్శించుకున్నారు.